సాక్షి అనంతపురం

బుధవారం । 3 । జూలై । 2024



నార్లు నేరుగా నాటుకోవద్దు

నర్సరీల్లో సేకరించిన నార్లను రైతులు నేరుగా పొలాల్లో నాటుకోరాదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

8లో



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం

37.5°/23.7°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ప్రారంభం



ఎమర్జెనీ మెడిసిన్ విభాగాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనా స్పత్రిలో మంగళవారం ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాన్ని ప్రారంభించారు. గతంలో ఉన్న క్యాజువాలిటీనే ఎమర్జెన్సీ మెడిసిన్‌గా మార్పు చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సత్వర వైద్యం అందించేందుకు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నూరుల్లా ఖాన్, కల్యాణ్ తదితరుల పర్యవేక్షణలో రోగులకు వైద్య సేవలందుతాయన్నారు. క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు(సీఎంఓ) ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి పరిధిలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ బీమసేనాచార్, సర్జన్ డాక్టర్ మనోహర్ రెడ్డి తదితరులున్నారు.

4 రోజుల్లో వర్షాలు

బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న 4 రోజుల్లో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 35.5-36.6, రాత్రి ఉష్ణోగ్రతలు 25.6-26.2 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 64-70 శాతం, మధ్యాహ్నం 44-52 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండండి



అంబాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

కణేకల్లు: డయేరియాపై అప్రమత్తంగా ఉంటూ నివారణ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ ఈబీ దేవీ అన్నారు. మండలంలోని అంబాపురం గ్రామంలో డయేరియాతో బోయ వండ్రప్ప (71) మృతి చెందిన నేపథ్యంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్ విజయకుమార్‌నాయక్‌తో కలిసి మంగళవారం ఆమె గ్రామాన్ని సందర్శించారు. మృతుని ఇంటికెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయించాలని పంచాయతీ కార్యదర్శి చంద్రకళకు సూచించారు. అనంతరం కణేకల్లు నేసేపేట కాలనీని డీఎంహెచ్ఓ సందర్శించారు. పంట కాల్వను శుభ్రం చేయించాలని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్‌కు సూచించారు. యర్రగుంట పీహెచ్‌సీలో 'స్టాప్ డయేరియా' కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ సిబ్బంది, వైద్యసిబ్బంది సమన్వయంతో పని చేసి డయేరియా వ్యాపించకుండా చూడాలన్నారు. ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు తగ్గే వరకు హెల్త్ క్యాంపు

రాయదుర్గం రూరల్: వాంతులు, విరేచనాలతో పాటు జ్వరం, చలి, తలనొప్పి, వికారం, ఫ్లూ లాంటి అనారోగ్య సమస్యలు తగ్గే వరకు గ్రామంలో హెల్త్ క్యాంపును నిర్వహించాలని జిల్లా వైద్యాధికారిణి (డీఎంహెచ్ఓ) ఈ భ్రమరాంబదేవి ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యాధికారులను ఆదేశించారు. గత 4 రోజులుగా నాగిరెడ్డిపల్లికి చెందిన 25 మంది వాంతులు, విరేచనాలతో బళ్లారి విమ్స్, ఆర్డీటీ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆమె మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఎపిడమిక్ సెల్ కోఆర్డినేటర్ వేమారెడ్డి, ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేంద్ర ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, ఏఎన్ఎం నాగమణి , పంచాయతీ కార్యదర్శి కొల్లప్ప, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు ఆదరణేదీ..?

- ప్రతిభావంత విద్యార్థులను వెన్నుతట్టి ప్రోత్సహించిన గత ప్రభుత్వం
- నగదు పురస్కారాలతో పాటు సత్కారాలు
- ఈ విషయంపై దృష్టి సారించని చంద్రబాబు సర్కారు
- గత ఏడాది జూన్ 20నే ప్రోత్సాహకాల పంపిణీ
- ఈ సారి జూలై వచ్చినా స్పష్టత కరువు
- విద్యార్థులు, తల్లిదండ్రులకు నిరాశ

పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆణిముత్యాలు పేరిట అందించిన నగదు ప్రోత్సాహకాల కార్యక్రమానికి కొత్త ప్రభుత్వం మంగళం పాడినట్లు తెలుస్తోంది. గత ఏడాది జూన్ 20 కల్లా అన్ని స్థాయిల్లో విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందాయి. ప్రస్తుతం జూలై ప్రారంభమైనా ఆ విషయం గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.



గత ఏడాది ఆణిముత్యాల నగదు పురస్కార కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి టాపర్లతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి (ఫైల్)

తాడిపత్రి రూరల్: విద్యారంగానికి వైఎస్ జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఒక వైపు సర్కారు బడులను అభివృద్ధి చేస్తూనే.. మరోవైపు ప్రతిభ కలిగిన విద్యార్థులను అడుగడుగునా వెన్నుతట్టి ప్రోత్సహించింది. ఆ క్రమంలోనే ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో పోటీ తత్వం పెంచడంతో పాటు మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలనే గొప్ప ఆశయంతో 'జగనన్న ఆణిముత్యాలు' పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలిచిన వారికి రూ. లక్ష చొప్పున, ద్వితీయ స్థానంలో ఉన్న వారికి రూ. 75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ. 50 వేల చొప్పున అందించింది. వీరితో పాటు జిల్లా, నియోజకవర్గ, పాఠశాల స్థాయిలో టాపర్లుగా నిలిచిన వారికి కూడా నగదు ప్రోత్సాహకాలు పంపిణీ చేసింది. గత ఏడాది స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 42 మంది పదో తరగతి విద్యార్థులు, 24 మంది ఇంటర్ విద్యార్థులకు నగదుతో పాటు షీల్డ్, మెడల్ అందజేసి ఘనంగా సత్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద అప్పట్లో 22,768 మంది విద్యార్థులకు ప్రభుత్వం పురస్కారాలు అందజేసి ప్రోత్సహించింది. జిల్లా స్థాయిలో టాపర్లకు రూ.50 వేలు, ద్వితీయ స్థానం పొందిన వారికి రూ.30 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 15 వేలు, నియోజకవర్గ స్థాయిలో టాపర్లకు రూ. 15 వేలు, ద్వితీయ స్థానంలో ఉన్న వారికి రూ. 10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 5 వేలు, పాఠశాల స్థాయిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థికి రూ. 3 వేలు, ద్వితీయ విద్యార్థికి రూ. 2 వేలు, తృతీయ స్థానంలో ఉన్న వారికి రూ. 1,000 చొప్పున నగదు అందించడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు.

నిరాశలో టాపర్లు

ప్రభుత్వం మారడంతో ఆణిముత్యాలు పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సదుద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకంపై ప్రస్తుత చంద్రబాబు సర్కారు ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు. విద్యాశాఖ అధికారులను అడిగినా తమకూ స్పష్టత లేదంటున్నారు. దీంతో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులు నిరాశ చెందుతున్నారు. నగదు ప్రోత్సాహకాలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పథకం అమలు కాకుంటే దాని ప్రభావం విద్యార్థుల భవిష్యత్తు చదువులపై పడవచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కింది స్థాయి తరగతుల విద్యార్థుల్లో చదువులపై ఆసక్తి తగ్గే అవకాశముందంటున్నారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని పథకాన్ని కొత్త ప్రభుత్వం కొనసాగించాలని కోరుతున్నారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాలో పదో తరగతిలో 409 మంది విద్యార్థులకు గాను 71.15 శాతం 291 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌లో 928 మంది విద్యార్థులకు గాను 70.58 శాతంతో 655 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో 13వ స్థానంలో అనంతపురం జిల్లా నిలిచింది. ఈ నెల 13లోపు రీకౌంటింగ్, రీ-వెరిఫికేషన్ జవాబు పత్రాల జిరాక్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి తెలిపారు. జవాబు పత్రం రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ. 200, రీ-వెరిఫికేషన్ జవాబుపత్రం జిరాక్స్ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ. వెయ్యి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఫీజును మీసేవా/ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించాలని వెల్లడించారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీఏ, బీఎస్సీ, బీకాంలో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ముందుగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. దీని కోసం బుధవారం నుంచి కళాశాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 10 లోపు కళాశాలలోని ఆయా విభాగాధిపతులను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలి. 11 నుంచి 15 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉంటుంది.

మొక్కలు నాటి సంరక్షించండి : పీసీసీఎఫ్



మొక్క నాటి నీరు పోస్తున్న అటవీశాఖ అధికారులు

ఆత్మకూరు: మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలకు అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ (పీసీసీఎఫ్) రమేష్‌కుమార్ సుమన్, జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) వినీత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద ఉన్న సిటీ పార్కును మంగళవారం వారు సందర్శించారు. మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యతపై ప్రజలను చైతన్య పరచాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఇంటి ఎదుట ఓ మొక్క తప్పనిసరిగా నాటించేలా కార్యాచరణను అమలు చేయాలన్నారు. అనంతరం పార్క్ అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కేసులు తేలిగ్గా తీసుకోవద్దు

- కౌంటర్ దాఖలులో నిర్లక్ష్యం తగదు
- కలెక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'కోర్టు కేసులను తేలికగా తీసుకోకండి. వాటిని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా పరిస్థితి వేరేగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ధిక్కరణకు దారితీస్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేసుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి' అని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. డివిజన్ వారీగా కోర్టు కేసుల పెండింగ్‌పై సమీక్షించారు. జిల్లా, డివిజన్, మండల రెవెన్యూ కార్యాలయాల పరిధిలో మొత్తం కేసులు ఎన్ని ఉన్నాయి? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? ఎందుకు పెండింగ్‌లో ఉంచారనే వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోర్టు కేసు అనేది చాలా సున్నితమైన అంశమన్నారు. కౌంటర్ దాఖలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే ఫలితం తీవ్రంగా ఉంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను రోజూ ఒకటి చొప్పున పూర్తి చేయాలని చెప్పారు. ప్రొసీజర్ ప్రకారం పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఇకపై ఈ అంశంపై తరచూ సమీక్షిస్తానని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డీఓలు జి.వెంకటేష్, వి.శ్రీనివాసులు రెడ్డి, రాణిసుస్మిత, కలెక్టరేట్ పరిపాలనాధికారి అంజన్‌బాబు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు వివరాలు సమర్పించండి

ఎన్నికల ఖర్చుకు సంబంధించి తుది లెక్కల వివరాలను సమర్పించాలని, ఈ ప్రక్రియ బుధవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఖర్చు తుది లెక్కల వివరాల సమర్పణ అంశంపై విలాస్ వి.షిండే, నితిన్ అగర్వాల్, రాందాస్ టి.కాలే, కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్ బృందం అధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకు తుది లెక్కల వివరాలు సమర్పించని అభ్యర్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ఖర్చుకు సంబంధించి తుది లెక్కల వివరాలను నిర్దేశించిన తేదీలోగా ప్రకటించాలన్నారు. లేని పక్షంలో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. వివరాలు సమర్పించిన అభ్యర్థులు భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోవాల్సి ఉంటుందన్నారు. ఖర్చుకు సంబంధించి తుది లెక్కల వివరాలు సమర్పించని అభ్యర్థులను పిలిపించికుని అకౌంట్ ఫైనలైజ్ చేయాలని చెప్పారు. బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా నివేదికలను, లెక్కల వివరాలను, తుది అకౌంట్లను సమర్పించేలా చూడాలన్నారు. సమావేశంలో డీసీఓ అరుణ కుమారి, టూరిజం ఆర్‌డీ వెంకటేశ్వర్లు, బృందం అధికారులు పాల్గొన్నారు.

మీ సేవలు అమూల్యం

- కలెక్టర్ వినోద్‌కుమార్
- రిటైర్డ్ ఉద్యోగులకు ఘన సత్కారం



ఉద్యోగ విరమణ చేసిన వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ సీఈఓ నిదియాదేవి, తదితరులు

అనంతపురం అర్బన్: 'ప్రభుత్వ ఉద్యోగులుగా ఇటు ప్రభుత్వానికి అటు ప్రజలకు మీరు అందించిన సేవలు చాలా అమూల్యమైనవి' అంటూ ఉద్యోగ విరమణ చేసిన వారి సేవలను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ కొనియాడారు. మే, జూన్ నెలల్లో ఉద్యోగ విరమణ చేసిన వివిధ శాఖలకు చెందిన 70 మంది అధికారులు, ఉద్యోగులకు మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జిల్లా యంత్రాంగం తరఫున సామూహిక సన్మాన కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ... శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలన్నారు. అందరికీ ఒక్కొక్క మొక్క అందించి దానిని నాటి సంరక్షించాలని కోరారు. సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వైభోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, కుటుంబసభ్యులతో కలసి విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

మెరిపిస్తూ.. మోసగిస్తూ

- గ్రానైట్ దుకాణ యజమానుల ఇష్టారాజ్యం
- వినియోగదారులకు నాసిరకం సరుకు అంటగడుతున్న వైనం
- ఇదేంటని ప్రశ్నిస్తే దౌర్జన్యం
- ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక బాధితుల సతమతం
- తమ పరిధిలో లేదంటున్న జీఎస్టీ, మైనింగ్ అధికారులు

- గుంతకల్లుకు చెందిన పద్మజ నెలన్నర క్రితం అనంతపురం నగరంలో బళ్లారి రోడ్డులో ఉన్న ఓ గ్రానైట్ బండల దుకాణంలో 18 చదరాల బండలు తీసుకెళ్లింది. కొన్ని రోజులకు ఇంట్లో ఫ్లోరింగ్ వేద్దామని చూస్తే బండలన్నీ పగుళ్లు తేలి కనిపించాయి. వెంటనే గ్రానైట్ దుకాణ యజమానికి ఫోన్ చేసి అడిగితే తమకు సంబంధం లేదంటూ బుకాయించారు. మీ ఇష్టమొచ్చిన వారికి ఫిర్యాదు చేసుకోండంటూ దౌర్జన్యం చేశారు.

- కడపకు చెందిన ఓ మహిళ ఇటీవల అనంతపురంలోని ఓ షాపులో సుమారు 26 చదరాల బండలు తీసుకెళ్లింది. కొన్ని రోజుల తర్వాత చూస్తే బండలు మొత్తం పగుళ్లుబారాయి. దీంతో ఆమె నగరంలోని టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే దుకాణ యజమాని అక్కడకు చేరుకున్నాడు. బండలను వెనక్కు తీసుకోను, కావాలంటే తక్కువ రేటుకు వేరే రకం బండలు ఇస్తానని నచ్చజెప్పాడు.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఇటీవలి కాలంలో గ్రానైట్ దుకాణాలపై ఫిర్యాదులు ఎక్కువవుతున్నాయి. కొందరు గ్రానైట్ దుకాణ యజమానుల మోసాలతో ఇళ్లు కట్టుకుంటున్న వారు ఘొల్లుమంటున్నారు. రూ. లక్షలు వెచ్చించి తీసుకొచ్చిన గ్రానైట్.. కొన్ని రోజులకే పగుళ్లు తేలి కనిపిస్తుండడంతో గృహ నిర్మాణదారుల పాట్లు అన్నీ ఇన్నీ కావు. దుకాణం నుంచి గ్రానైట్ బండ ఎత్తితే చాలు తమకు బాధ్యత లేదన్నట్లుగా దుకాణ యజమానులు వ్యవహరిస్తుండడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ఎక్కువగా పేద, మధ్య తరగతికి చెందిన బాధితులే ఎక్కువగా ఉంటున్నారు.

ప్రశ్నిస్తే తిరగబడుతున్న వైనం..

కొత్తగా ఇళ్లు కట్టుకునే వారికి నివాసంలో గ్రానైట్ బండలు పరుచుకోవడం అనేది ఒక కల. కానీ వీటిల్లో మంచివేవో, నాసిరకం సరుకేదో ఎవరికీ తెలియదు. దుకాణం దగ్గర ఎంపిక చేసుకున్న రకం గ్రానైట్ బండలను లారీకెక్కించే వరకూ బాగానే ఉంటాయి. ఇంటికెళ్లి వారం లేదా పదిరోజుల తర్వాత చూస్తే అన్నీ పగుళ్లే. ఈ క్రమంలో ఆ బండలను వెనక్కు తేలేక, కొత్తవి తెచ్చుకోలేక వినియోగదారులు సతమతమవుతున్నారు. దీనిపై గ్రానైట్ దుకాణ యజమానులను నిలదీస్తే బాధితులపైనే దౌర్జన్యం చేస్తున్నారు. 'మా దగ్గర తీసుకెళ్లినప్పుడు బాగానే ఉన్నాయి. మీరు చూసే తీసుకెళ్లారు. ఇప్పుడు మాకేం సంబంధం' అంటూ తిరగబడుతున్నారు.

నూనె రాయడంతోనే మెరుపులు..

రూ. లక్షలు పోసి కొంటున్న గ్రానైట్ రాళ్లలో మతలబు ఏమిటో ఎవరికీ అంతుచిక్కని పరిస్థితి. వినియోగదారులను ఆకర్షించేందుకు బండలకు నూనెలు రాస్తారని, కొన్ని రోజులకు దాని తేమ తగ్గాక పగుళ్లు వస్తున్నాయని కొంతమంది చెబుతున్నారు. మరోవైపు గ్రానైట్ రవాణా చేసే లారీలు, కూలీలు కూడా షాపు యజమానుల సిండికేట్‌లో ఉన్నట్లు తెలిసింది. వాళ్లు ఎంత చెబితే అంతకు రవాణా అవుతాయి.. లేదంటే కొత్త వాళ్లెవరూ బండలను తీసుకెళ్లేందుకు రావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు.

ఎవరికి ఫిర్యాదు చేయాలో..?

అనంతపురంలోని బళ్లారి బైపాస్ రోడ్డులో ఎక్కువగా గ్రానైట్ బండల వ్యాపారం జరుగుతోంది. వైఎస్సార్, కర్నూలు జిల్లాలవాసులూ ఇక్కడ నుంచే బండలు తీసుకెళ్తుంటారు. గ్రానైట్ తీసుకెళ్లే వినియోగదారులు మోసపోతున్నా ఎవరికి ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందో తెలియని పరిస్థితి. మైనింగ్ శాఖ అధికారులు రిటైల్ వ్యాపారం తమ పరిధిలోకి రాదంటున్నారు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులూ తమ పరిధిలోనిది కాదని, తాము పన్నులు కట్టారా లేదా అన్నదే చూస్తామని చెబుతున్నారు. ఇలా ఎవరికి వారు తమకు సంబంధం లేదంటుండడంతో బాధితుల ఆవేదన వర్ణనాతీతంగా మారుతోంది.

మా పరిధి కాదు..

గ్రానైట్ లేదా మార్బుల్స్ నాణ్యతా వ్యవహారాలు మా పరిధిలోకి రావు. మేం ఆయా షోరూంలు లేదా దుకాణ యజమానులు రాయల్టీ కడుతున్నాయా లేదా అనే విషయాన్ని మాత్రమే చూస్తాం. మిగతా విషయాలు మా పరిధిలోకి రావు. ఇలాంటి ఫిర్యాదులు మాకేవీ రాలేదు కూడా.

–నాగయ్య, మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్

క్లుప్తంగా

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన డీసీఓ

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను డీసీఓ మురళీకృష్ణ మంగళవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, పాఠశాల పరిసరాలు, తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సౌభాగ్య లక్ష్మి, వార్డెన్ మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ నక్సలైట్ అరెస్ట్

పావగడ: తాలూకాలోని తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన వెంకటమ్మనహళ్లిలో జవాన్ల శిబిరంపై దాడి చేసి, 9 మంది సైనికుల మృతికి కారణమైన కేసులో నిందితుడిగా ఉన్న నక్సలైట్ (ప్రస్తుతం మాజీ)ను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కేశవాపురం గ్రామానికి చెందిన చంద్రు అలియాస్ ముత్యాలు అప్పట్లో నక్సలైట్ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్నాడు. 2005లో పావగడ తాలూకాలోని వెంకటమ్మనహళ్లి గ్రామ సరిహద్దులో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన జవాన్ల శిబిరంపై నక్సలైట్లు విరుచుకుపడ్డారు. ఆ సమయంలో 9 మంది జవాన్లు వీరమరణం పొందారు. ఈ ఘటనలో పాల్గొన్న 32 మంది నక్సలైట్లపై పోలీసులు కేసు నమోదు చేసి, పలువురిని అరెస్ట్ చేశారు. అప్పట్లో పోలీసుల కళ్లు కప్పి తప్పించుకుని తిరుగుతూ జనజీవన స్రవంతిలో కలసిన చంద్రును మంగళవారం తుమకూరు, బెంగుళూరు అంతరంగిక భద్రత విభాగానికి చెందిన యాంటీ నక్సల్ బృందం అరెస్ట్ చేసింది.



ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

MISSION LiFE

సవరణ

[illegible]

తేది: 24.02.2024న నాటి పత్రికా ప్రకటనలో పేర్కొన్న ప్రాజెక్ట్ వివరాలు యథాతథంగా ఉంటాయి.

ప్రదేశం: అనంతపురము
తేది : 03.07.2024

సం/- ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్,
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయము, అనంతపురము

● చూడచక్కని చాగల్లు

'ఎంత చక్కని ఊరమ్మ... చూడ చక్కని చంద మామ... నన్ను గన్న నా పల్లె... నిండు గుండాల మాయమ్మ' అంటూ కూలీలు పాడుతూ పెద్ద పప్పూరు మండలం చాగల్లు రిజర్వాయర్ కింద పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలి నాలుగేళ్లు పెన్నానది పరవళ్లు తొక్కడంతో చాగల్లు డ్యాం జలకళను సంతరించుకుంది. ఈ క్రమంలో డ్యాం పరిధిలో పంటల సాగు ఊపందుకుంది. అరటి మొక్కల మధ్య అంతరసాగు చేస్తున్న రైతులు... రిజర్వాయర్ లోతట్టు ప్రాంతంలో జీవాల సందడి... ఇలా చెప్పుకుంటే పోతే చెట్టు నుంచి పుట్ట వరకూ అన్నింటినీ ప్రకృతి తీర్చిదిద్దిన తీరు మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతోంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


చాగల్లు రిజర్వాయర్ లోతట్టు ప్రాంతంలో గడ్డి మేస్తున్న గొర్రెలు


సేద్యం పనుల్లో నిమగ్నమైన కూలీలు


అరటిలో అంతర సేద్యం చేస్తున్న రైతులు


డ్యాంలో ఆహారం కోసం వెతుకుతున్న పావురాలు

వివాహిత అనుమానాస్పద మృతి


మృతురాలు నేత్ర

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీరంగాపురం క్యాంపునకు చెందిన వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని చెళ్లకెర తాలూకా భోగనహళ్లికి నేత్ర (30)కు 2015లో శ్రీరంగాపురం క్యాంపు గ్రామానికి చెందిన టి.వెంకటేశులుతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా పుట్టింటికి వెళ్లి డబ్బు తీసుకురావాలంటూ నేత్రను భర్తతో పాటు అత్త, ఆడపడచు వేధించసాగారు. ఈ క్రమంలో సోమవారం నేత్ర మృతి చెందింది. సమాచారం అందుకున్న మృతురాలి కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. భర్త కొట్టడం వల్లనే నేత్ర మృతి చెందిందంటూ మృతురాలి తల్లి లక్ష్మీదేవమ్మ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

తుంగభద్రపై చి'వరి' వరకూ ఆశలు

- టీబీ డ్యామ్‌కు 172 టీఎంసీల నీటి లభ్యతపై అంచనా
- ఈ నెల 20 లోపు నీటి విడుదలకు కార్యాచరణ




చెర్లోపల్లి వద్ద చేపడుతున్న యూటీ పనులు

రాయదుర్గం: కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల జీవనాడిగా ఉన్న తుంగభద్ర జలాశయంపై హెచ్చెల్సీ చివరి ఆయకట్టు రైతులూ ఆశలు పెట్టుకున్నారు. గతేడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తుంగభద్ర బేసిన్‌లో కనిష్ట వర్షపాతం నమోదైంది. దీంతో అప్పట్లో జలాశయంలో 114.58 టీఎంసీల వరకు మాత్రమే నీరు చేరింది. ఇందులో తాగునీటి అవసరాలకు పోను 16.07 టీఎంసీలను హెచ్చెల్సీ వాటాగా కేటాయించారు. ఫలితంగా రాయదుర్గం హెచ్చెల్సీ సబ్‌డివిజన్ పరిధిలోని బొమ్మనహాళ్ నుంచి తాడిపత్రి వరకూ 70 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వచ్చింది. నీటి కొరత దృష్ట్యా అప్పట్లో ఎక్కువగా ఆరుతడి పంటలతోనే రైతులు సరిపెట్టుకున్నారు. ఈ ఏడాది నైరుతి ప్రభావంతో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తుగా ప్రకటించింది. దీంతో కర్ణాటక, ఏపీ, తెలంగాణ ఇంజనీరింగ్ అధికారులు ఇటీవల టీబీ బోర్డు కార్యాలయంలో సమావేశమై నీటి లభ్యత, పంపకాలపై చర్చించారు. డ్యామ్‌లోకి గతం కంటే ఎక్కువగా 172 టీఎంసీల నీరు చేరుతుందనే అంచనాకు రావడంతో ఈ ఖరీఫ్‌లో హెచ్చెల్సీ వాటాగా 26.36 టీఎంసీల నీటిని కేటాయిస్తూ ప్రాథమిక అంచనాలు రూపొందించారు. దీంతో చివరి ఆయకట్టు రైతులూ ఈ సారి వరి సాగుపై దృష్టి సారిస్తున్నారు.

20వ తేదీ నీటి విడుదల?

బోర్డు సమావేశంలో పలు అంశాలపై అధికారులు తీర్మానాలు చేశారు. ఈ ఏడాది హెచ్చెల్సీ చివరి ఆయకట్టు వరకూ నీటిని అందించాలని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే వాతావరణం అనుకూలిస్తే ఈ నెల 15వ తేదీ లోపు జలాశయం 170 టీఎంసీల నీటి మట్టానికి చేరుకోవచ్చునని అంచనా వేశారు. ఇదే నిజమైతే ఈ నెల 20వ తేదీని హెచ్చెల్సీకి నీటి విడుదలకు అవసరమైన కార్యాచరణనూ రూపొందించారు. ఈ క్రమంలోనే గతేడాది దెబ్బతిన్న ప్రధాన కాలువకు తాత్కాలిక మరమ్మతులు మొదలుపెట్టారు.

చివరి ఆయకట్టుకూ నీరు

టీబీ బోర్డు తీర్మానానికి అనుగుణంగా ఈ ఏడాది 172 టీఎంసీలు డ్యామ్‌లోకి చేరితే హెచ్చెల్సీ వాటాగా 26.36 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు వీలవుతుంది. జలాశయంలోకి నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో ముందస్తు కార్యాచరణకు శ్రీకారం చుట్టాం. ఈ నేపథ్యంలో యూటీ, కాలువ మరమ్మతు పనులు చేపట్టాం. చివరి ఆయకట్టుకూ సమృద్ధిగా నీరందించేలా చర్యలు తీసుకున్నాం.

– రమణారెడ్డి, హెచ్చెల్సీ ఈఈ, అనంతపురం

7.909 టీఎంసీలకు చేరిన నీరు

బొమ్మనహాళ్: కర్ణాటకలోని తుంగా జలాశయం నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో మంగళవారం ఉదయానికి 13,410 క్యూసెక్కులకు పైగా వరద తుంగభద్ర జలాశయానికి చేరింది. ప్రస్తుతం డ్యాంలో 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,585.87 అడుగులకు నీరు చేరింది. డ్యాం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 7.909 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో 13,410 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 297 క్యూసెక్కులుగా ఉంది.

తల్ సైనిక్ శిబిరానికి ఎంపికయ్యేలా శిక్షణ ఇవ్వండి

- ఎన్‌సీసీ కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ రమేష్


సూచనలిస్తున్న కల్నల్ ఎన్.రమేష్

కూడేరు: దేశ రాజధాని ఢిల్లీలో సెప్టెంబర్‌లో జరిగే తల్‌సైనిక్–2024 శిబిరానికి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది క్యాడెట్లు ఎంపికయ్యేలా శిక్షణ ఇవ్వాలని ఎన్‌సీసీ అధికారులకు కర్నూలు గ్రూప్ కమాండర్ ఎన్.రమేష్ సూచించారు. రెండు రోజులుగా కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో జరుగుతున్న సీఏటీసీ–2 ఎన్‌సీసీ శిక్షణా తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. తల్ సైనిక్ శిబిరానికి ఎంపికయ్యేలా హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్, నిజామాబాద్, కర్నూలు, గుంటూరు, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి గ్రూపులకు చెందిన క్యాడెట్లకు ఇస్తున్న శిక్షణ అంశాలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమై మాట్లాడారు. క్యాడెట్లకు శిక్షణ ఇచ్చే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండర్ కల్నల్ బీఎస్ ప్రసాద్, కమాండర్ కల్నల్ కులకర్ణి, డిప్యూటీ కమాండర్ శశికుమార్, ఎన్‌సీసీ అధికారులు, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 550 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

పుట్లూరు: బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థినిని అదే గ్రామానికి చెందిన రవితేజ గత నెల 23న తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో బలవంతంగా ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెళ్లాడు. అనంతరం తాడిపత్రి మార్కెట్ యార్డు సమీపంలో నిలిపి ఉన్న ఐచర్ వాహనంలో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయటకు చెబితే చంపుతానని బెదిరించి అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. ఇంటి వద్ద తమ కుమార్తె లేకపోవడంతో తల్లిదండ్రులు గాలింపు చేపట్టారు. జూన్ 24న ఉదయం 6 గంటలకు తాడిపత్రి కూరగాయల మార్కెట్ వద్ద తమ కూతురు ఉన్నట్లు సమాచారం అందుకున్న వారు అక్కడికెళ్లి బాలికను పిలుచుకొచ్చారు. అయితే ఆమె ముభావంగా ఎవరితోనూ మాట్లాడకుండా తనలోతానే కుమిలి పోతుండడంతో మంగళవారం తల్లిదండ్రులు గట్టిగా ఆరా తీశారు. దీంతో తనపై జరిగిన అఘాయిత్యాన్ని ఆమె వివరించింది. ఘటనపై బాధిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రవితేజతో పాటు ఆయనకు సహకరించిన నాగేంద్రపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు.

వైద్య విద్యతో వ్యాపారమా?

- రేపు విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి
- ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు


మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేలా కేంద్ర ప్రభుత్వం వైద్య విద్యను వ్యాపారంగా మార్చేస్తోందని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. నీట్ పరీక్ష ఫలితాలపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించి, నీట్ పరీక్ష, ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) సంస్థను రద్దు చేయాలంటూ ఈ నెల 4న దేశవ్యాప్తంగా తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జిల్లాలోనూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతపురంలోని గణేనాయక్ భవన్ (సీపీఎం జిల్లా కార్యాలయం)లో మంగళవారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనుమల నరేష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, ఏఐఎస్‌ఏ నగర కార్యదర్శి బాలకృష్ణ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్, పీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఆలాం, వీఎస్‌ఐవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా నాయకులు భీమేష్ మాట్లాడారు. నీట్ ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంగా ఏపీ ప్రభుత్వం స్పందించాలన్నారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నార్లు నేరుగా నాటుకోవద్దు

- ఖరీఫ్ వేరుశనగ, పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- వ్యవసాయ శాస్త్రవేత్తలు విజయశంకర్ బాబు, నారాయణస్వామి

అనంతపురం అగ్రికల్చర్: కూరగాయల పంటలు సాగు చేసే రైతులు వివిధ ప్రాంతాల నర్సరీల నుంచి సేకరించుకున్న నార్లను నేరుగా పొలాల్లో నాటుకోరాదని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకర్‌బాబు, సేద్యపు విభాగపు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి సూచించారు. చాలా మంది రైతులు మిరప, టమాట, వంగ లాంటి కూరగాయల పంటలు సాగులో నార్లను నేరుగా నాటడం వల్ల వివిధ రకాల వైరస్ తెగుళ్లు, చీడపీడలు ఆశించే ప్రమాదం ఉందన్నారు. నార్లు నాటుకునే ముందు తప్పనిసరిగా లీటర్ నీటికి 2.5 మి.లీ క్లోరిపైరిపాస్, 3 గ్రాముల కార్బండిజమ్ కలిపిన ద్రావణంలో ముంచి నాటుకుంటే ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు.

- ఇక ఖరీఫ్ కింద ముందస్తుగా అక్కడక్కడ సాగు చేసిన వేరుశనగ పంట ప్రస్తుతం శాఖీయ దశలో ఉన్నందున అంతర సేద్యం చేసుకోవాలన్నారు. అలాగే రసంపీల్చు పురుగు, లద్దె పురుగు, శనగ పచ్చ పురుగు ఆశించడానికి అనుకూలమైన వాతావరణం ఉన్నందున నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రసంపీల్చు పురుగు ఉధృతిని గమనించేందుకు పొలంలో ఎకరాకు 10 చొప్పున జిగురు పూసిన అట్టలు, మరో నాలుగు ఫిరమోన్ ట్రాప్స్ ఏర్పాటు చేయాలన్నారు.
- వేరుశనగలో పొగాకు లద్దెపురుగు, శనగపచ్చ పురుగు నివారణకు విత్తిన 10 నుంచి 15 రోజుల్లోపు ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి రెక్కల పురుగులు ఆకర్షించేలా చేయాలన్నారు. అలాగే ఎకరాకు 20 వరకు పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలన్నారు. గుడ్లు, పురుగులు చిన్నవిగా ఉన్నపుడు 5 శాతం వేపగింజల కషాయాన్ని పిచికారీ చేయాలన్నారు. ఉధృతిని బట్టి లీటర్ నీటికి 2 మి.లీ క్వినాల్‌ఫాస్ లేదా 5 మి.లీ వేపనూనె కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. లార్వాలు ఎదిగినట్లు గమనిస్తే... లీటర్ నీటికి 0.4 గ్రాములు ఎమామెక్టిన్ బెంజోయేట్ లేదా 2.5 మి.లీ క్లోరిపైరిపాస్ కలిపి పిచికారీ చేయాలన్నారు.
- పత్తి పంటలో రసంపీల్చు పురుగులు ఆశించే అవకాశం ఉందని, తొలి దశలో లీటర్ నీటికి 5 మి.లీ వేపనూనె లేదా 5 శాతం వేపగింజల కషాయాన్ని కలిపి పిచికారీ చేయాలన్నారు. తెల్లదోమ ఉధృతిని గమనించేందుకు ఎకరాకు 10 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలన్నారు. వీటి నివారణకు లీటర్ నీటికి 0.4 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 0.2 గ్రాములు థయోమిథాక్సామ్ లేదా 0.2 గ్రాములు అసిటామిప్రిడ్ కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

● కనులపండువగా బోనాల జాతర


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న బంజారా మహిళలు, సంఘ ప్రతినిధులు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


ఊరేగింపులో ఉత్సాహంగా..

అనంతపురం కల్చరల్: నగరంలోని నాయక్ నగర్ లో మంగళవారం బంజారాల బోనాల జాతర కనులపండువగా సాగింది. బంజారా మహిళలు ఆటపాటలతో సందడి చేశారు.వర్షాలు విస్తారంగా కురవాలని, తండాల్లో సౌభాగ్యం వెల్లివిరియాని ఆకాంక్షిస్తూ తమ ఆరాధ్యదైవం మారెమ్మకి బోనాలు సమర్పించారు. ముందుగా సీత్లాయాడి, మరియామా,తోల్జాయాడి,కంకాళి,సాప్లామ యాడి ,హింగిలాస్ భవాని, మత్రాళి అక్కమ్మదేవతామూర్తులను సుందరంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. దేవతారూపాలకు ఇష్టమైన వంటకాలతో మేళతాళాలు, భాజా భజంత్రీల నడుమ శోభాయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చంద్రాబాయి, శివశంకర రాథోడ్, నారాయణనాయక్, రామకృష్ణా నాయక్, కిరణ్ నాయక్ పాల్గొన్నారు.

వైద్యులకు ఓపిక లేకపాయె


మెడిసిన్ విభాగంలో ఖాళీగా ఉన్న వైద్యుల కుర్చీలు


చిన్నపిల్లల ఓపీలో ఖాళీగా ఉన్న వైద్యుల కుర్చీలు

- సర్వజనాస్పత్రిలో నిర్లక్ష్యం
- సీట్లలో ఉండని వైద్యులు
- 11.30 గంటలకే కుర్చీలు ఖాళీ
- ఇబ్బందుల్లో రోగులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని కొన్ని విభాగాల్లో వైద్యులు సమయపాలన పాటించడం లేదు. ఓపీలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట లవరకు వైద్యులు అందుబాటులో ఉండాలి. అయితే 11.30 గంటలకే కుర్చీలను ఖాళీ చేస్తున్నారు. మంగళవారం సర్వజనాస్పత్రిలోని మెడిసిన్, చిన్నపిల్లల వార్డు, తదితర ఓపీల్లో వైద్యులు పత్తా లేకుండా పోయారు. దీంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఉమ్మడి జిల్లాలోని పేద, సామాన్య మధ్య తరగతి ప్రజానీకానికి పెద్ద దిక్కు. అటువంటిది వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ:

సర్వజనాస్పత్రిలో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఎప్పటికప్పుడు ఓపీ సేవలను పరిశీలించి, రోగులకు మెరుగైన వైద్య సేవలందించేలా చూడాల్సిన అధికారులు నిద్రమత్తులో ఉన్నారు. దీంతో వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పలు విభాగాల ప్రొఫెసర్లు సైతం ఓపీ సమయం కంటే ముందుగానే విధులకు డుమ్మా కొడుతున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఆస్పత్రి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

తన 9 నెలల బాబు ఆదిత్యకు జ్వరం వస్తోందని కళ్యాణదుర్గంకు చెందిన దాక్షవేణి సర్వజనాస్పత్రికి వచ్చింది. ఓపీ తీసుకుని వైద్యునితో చూయించుకుంది. మందులు తీసుకుని వస్తే వినియోగించే విధానాన్ని చెబుతామని వైద్యులు చెప్పారు. మందుల కోసం గంటల తరబడి నిరీక్షించిన దాక్షవేణి.. ఓపీ వద్దకు వచ్చే సరికి వైద్యులు పత్తా లేకుండా పోయారు. మెరుగైన వైద్యం అందుతుందని ఎంతో ఆశతో వచ్చే రోగులకు ఇక్కడకు రాగానే నిరాశలో కూరుకుపోవాల్సి వస్తోంది.


చంటిబిడ్డను ఎత్తుకుని చిన్నపిల్లల ఓపీ ముందు వైద్యుల కోసం ఎదురు చూస్తున్న కళ్యాణదుర్గానికి చెందిన మహిళ

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రికెట్ పోటీలో తలపడుతున్న మెడికల్ ఉద్యోగులు

అనంతపురం: ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడేది వైద్యులేనని, అయితే వారికి విధి నిర్వహణలో మానసిక ఒత్తిడి ఉంటుందని, ఈ నేపథ్యంలో క్రీడల్లో పాల్గొంటే మానసిక ఉల్లాసం కలుగుతుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నరంలోని పీటీసీ మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన వికాస్ భారత్ స్పోర్ట్స్ ఫెస్ట్–2024 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించి సరదాగా క్రికెట్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, డాక్టర్లు ప్రవీణ్, వరదరాజులు, శంకర్ నారాయణ, సునీత, రజిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో మెడికల్ ఉద్యోగులు పాల్గొని సరదాగా గడిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

పట్టించుకోకపోతే ప్రమాదమే


కెనరా బ్యాంక్ ముందు రోడ్డుపై ఉన్న మట్టి


వాహనాలు వెళ్తుండగా దుమ్ములేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో పలు చోట్ల రోడ్డుపై మట్టి చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకొని వచ్చి రోడ్లపై పేరుకుపోయింది. భారీ వాహనాలు వెళ్తే దుమ్ములేచి వెనుక వచ్చే వాహనదారుల కళ్లలో పడుతోంది. దుమ్ము ధూళి కమ్ముకొని ముందు వెళ్లే వాహనాలు కనిపించడం లేదు. ఆత్మకూరు సినిమా థియేటర్ సమీపంలోని రోడ్డుపై, నూతనంగా నిర్మించిన కెనరా బ్యాంక్ సమీపంలో ఈ పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు జరగక ముందే మట్టిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన సీఈకి అభినందనలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా నూతనంగా నియమితులైన డాక్టర్ సి. లోకేశ్వర్లను పరీక్షల విభాగం కంప్యూటర్ సెక్షన్ ఉద్యోగులు మంగళవారం ఘనంగా సత్కరించారు. అదే విధంగా మినిమం స్కేల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన ఎస్.వెంకటస్వామిని ఉద్యోగులు సన్మానించారు. పరీక్షల విభాగం యూజీ సెక్షన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.శంకర్, సూపరింటెండెంట్ ఫణి కృష్ణ, ప్రోగ్రామర్స్ బాలాజీ నాయక్, దివాకర్ శర్మ, విజయలక్ష్మి, జిలాన్‌బాషా, షెక్షావలి, వెంకటేశ్, సుకన్య, మాధవి, వాణిశ్రీ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


నూతన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సి. లోకేశ్వర్లను అభినందిస్తున్న ఉద్యోగులు

అదనపు కట్నం కావాలని వేధింపులు

అనంతపురం: అదనపు కట్నం కావాలని భర్త, అత్త, మామ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని మంజుల మాధవి అనే యువతి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ధరణి కిశోర్ తెలిపిన మేరకు నరేష్ కుమార్ అనే వ్యక్తితో రెండు సంవత్సరాల కిందట మంజుల మాధవికి వివాహమైంది. వివాహ సమయంలో రూ.1.5 లక్షల నగదు, రెండు తులాల బంగారు కట్నం కింద ఇచ్చారు. పెళ్లి అయిన కొన్ని రోజులు భార్యను బాగా చూసుకున్నాడు . అనంతరం అదనపు కట్నం తేవాలని భర్త నరేష్ కుమార్, అత్త లక్ష్మీదేవి, మామ నారాయణ, అత్త చెల్లెలు సావిత్రి, ఆమె భర్త రమణ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

యువకుడిపై దాడి

అనంతపురం: నగరంలోని ఎన్టీఆర్ స్కూల్ వద్ద ప్రశాంత్ అనే యువకుడిపై దాడి జరిగింది. త్రీ టౌన్ సీఐ ధరణి కిశోర్ తెలిపిన మేరకు వివరాలు. ప్రశాంత్ అనే యువకుడి చెల్లెల్ని ప్రేమిస్తున్నానని పవన్ అనే యువకుడు ప్రచారం చేసుకుంటున్నాడు. దీంతో ప్రశాంత్ పవన్‌ని హెచ్చరించాడు. తన చెల్లెలిపై దుష్ప్రచారం చేయద్దని హెచ్చరికలు జారీ చేశాడు. 15 రోజుల కిందట ఈ సంఘటన జరిగింది. అయితే ప్రశాంత్‌పై పవన్, అతని స్నేహితుడు ఇద్దరూ రాతితో, కట్టెతోనూ బలంగా దాడి చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిప్పంటించుకుని ప్రేమికుడి ఆత్మహత్య

రాప్తాడురూరల్: ప్రియురాలు పెళ్లికి నిరాకరించందనే మనస్తాపంతో ప్రేమికుడు ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ ఘటన మంగళవారం రాత్రి అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు పాపంపేట శివారులోని భాగ్యనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...భాగ్యనగర్‌కు చెందిన శ్రీధర్ ఏకైక కుమారుడు వసుదత్త (23) బీటెక్ పూర్తి చేశాడు. చిన్న వయసులోనే తల్లి మృతి చెందింది. తండ్రీ కొడుకు మాత్రమే ఉన్నారు. దత్త ప్రస్తుతం ఇంటివద్దే ఉంటున్నాడు. ఓ యువతిని ప్రేమించాడు. కుటుంబంలో పెళ్లికి ఒప్పుకోకపోవడంతో యువతి నిరాకరించింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన దత్త మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఇంట్లో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పు పెట్టుకున్నాడు. మంటలకు తాళలేక పెద్ద ఎత్తున కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి చూసి మంటలు అదుపు చేసే సమయానికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు


లక్ష్మీనారాయణస్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

పామిడి: పట్టణంలోని అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయం, చిన్న విఠోబ ఆలయంలో మంగళవారం యోగిని ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ఆలయాల్లోని శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణ స్వామితో పాటు రుక్మిణీ పాండురంగస్వామి దేవతామూర్తులను శోభాయమానంగా అలంకరించారు. వేదపండితులు విశ్వనాథశర్మ తదితరులు మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం గావించారు. ఈసందర్భంగా ఆయా ఆలయాలు గోవిందా, జై విఠల నామస్మరణలతో మార్మోగాయి.


పూజలందుకున్న శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి

ఎలక్ట్రికల్ షాప్‌లో చోరీ

గుత్తి: స్థానిక అనంతపురం రోడ్డులోని వాసవీ ఎలక్ట్రికల్ షాపులో చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత షట్టర్‌ను ధ్వంసం చేసి లోపలకు ప్రవేశించిన దుండగులు క్యాష్ బాక్స్‌లో ఉన్న దాదాపు రూ.10 వేల నగదుతో పాటు ఇతర విలువైన సామగ్రిని అపహరించుకెళ్లారు. మంగళవారం ఉదయం దుకాణం తీసేందుకు వెళ్లిన యజమాని వెంకటరమణ... చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

అండర్ 16 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి ఆర్డీటీ క్రికెట్ క్యాంపుకు చెందిన మహమ్మద్‌షా తమీం అండర్ 16 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికై నట్లు ఆర్డీటీ క్రికెట్ కోచ్ బార్గవ్ తెలిపారు. ఈనెల 20 వరకు విజయనగరంలో జరిగే అంతర్ జిల్లా టోర్నమెంట్‌లో పాల్గొంటాడన్నారు. తమీం ఎంపిక పట్ల ఆర్డీటీ ఏటీఎల్ లలిత, సీనియర్ కోచ్ సాధిక్‌వలి, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.


మహమ్మద్ షా తమీం

ఎర్రనేలకొట్టాల వంతెనపై రాకపోకలు షురూ




పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వంతెనపై వాహన రాకపోకలు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం కార్పొరేషన్: ఎర్రనేలకొట్టాల వంతెనపై రాకపోకలు ప్రారంభమయ్యాయి. మురుగునీటి పైప్‌లైన్ల వ్యవహారంలో సమస్య తలెత్తి అధికారులు రోడ్డును తాత్కాలింగా బ్లాక్ చేయగా ఎర్రనేల కొట్టాల, రాజీవ్ కాలనీ, లెక్చరర్స్ కాలనీవాసులకు ఇబ్బందిగా మారింది. దీనిపై 'అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం' శీర్షికన మంగళవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి స్పందించి ఘటన స్థలానికి వెళ్లి పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సతీష్, తదితర అధికారులకు కాల్ చేసి మాట్లాడారు. తక్షణం అధికారులు స్పందించి వంతెనపై రాకపోకలకు అడ్డంగా ఉన్న మట్టిని తొలగింపజేశారు. కాగా ప్రైవేట్ స్థల యజమానులు సైతం తమ స్థలంలో కాలువ పైప్‌లైన్ వేశారని, వాటిని తొలగించాలని డిప్యూటీ మేయర్‌కు విన్నవించగా..త్వరలో కల్వర్టు పని పూర్తి అవుతుందని, పైప్‌లైన్‌ను తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్పొరేటర్ లాలూ, మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో యోగినీ ఏకాదశి


రుక్మిణీ విఠల పాండురంగ స్వామివార్లను దర్శించుకుంటున్న భక్తులు

అనంతపురం కల్చరల్: యోగిని ఏకాదశి సందర్భంగా రామనగర్ రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో మంగళవారం భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో రుక్మిణీ విఠల పాండురంగ నిజరూప దర్శనం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా కృష్ణనామ సంకీర్తనతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మహామంగళహారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు దుస్తకర్ తిరుపతిరావు, సెక్రటరీ ఆనంద్ మహేంద్రకర్ తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీల్లో కేశవరెడ్డి విద్యార్థుల ప్రతిభ


డ్యాన్స్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: చెన్నైలో ఇటీవల మూడురోజులపాటు జరిగిన 14వ జాతీయ స్థాయి డ్యాన్స్ పోటీల్లో అనంతపురం సాయినగర్ కేశవరెడ్డి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాలల ఏజీఎం ఎరుకలరెడ్డి తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వందలాది మంది డ్యాన్సర్లు పోటీ పడగా జూనియర్ విభాగంలో కేశవరెడ్డి విద్యార్థులు ద్వారక సాయి, మేఘ వర్షా, రూపశ్రీ, సబ్ జూనియర్ విభాగంలో జోయా, మహమ్మద్ రఫీ, సీనియర్ విభాగంలో రోషన్ నృత్యంలో విశేష ప్రతిభ కనబరిచి బంగారు, వెండి, రజత పతకాలను సాధించారని తెలిపారు. విద్యార్థులను, డ్యాన్స్‌మాస్టర్ లక్ష్మీకాంత్‌ను యాజమాన్యం అభినందించింది.

సర్వజనాస్పత్రిలో శునకాల స్వైర విహారం


చిన్నపిల్లల వార్డుకు వెళ్లే మెట్ల వద్ద కుక్క

అనంతపురం మెడిసిన్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నపిల్లల, ఈఎన్‌టీ తదితర వార్డులు, ఓపీ విభాగాల్లో కుక్కలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. సర్వజనాస్పత్రిలో రోజూ 2500 ఓపీ, 1100 అడ్మిషన్లు ఉంటాయి. రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రిలో కుక్కలు సంచరిస్తుండటంతో అవి ఎక్కడ కరుస్తాయోనని రోగులు, వారి సహాయకులు భయపడుతున్నారు. చిన్నపిల్లల వార్డుకు వెళ్లే మార్గంలోనే కుక్కలు తిరుగుతున్నాయి. పొరపాటున చిన్న పిల్లలను కరిస్తే పరిస్థితేంటో అర్థం కావడం లేదు. అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

గురు పౌర్ణమిని వైభవంగా నిర్వహిస్తాం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాబా మందిర సభ్యులు

అనంతపురం కల్చరల్: గురుపౌర్ణమి వేడుకలను ఈనెల 19 నుంచి 21 వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించనున్నట్లు బాబా మందిరాల రాష్ట్ర కమిటీ నిర్వాహకులు జయచంద్రచౌదరి తెలిపారు. మూడో రోడ్డులోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో మంగళవారం ఆయన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈనెల 7న పురవీధుల్లో శ్రీసాయినాథుని భిక్షా కార్యక్రమం ఉంటుందన్నారు. 19న శ్రీసాయినాథునికి రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామ సహిత పూజలు, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, 20న శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణం, శ్రీ అఖండ సాయినామ సంకీర్తన, 21న గురు పౌర్ణమి సందర్భంగా నగర సంకీర్తన, శ్రీమహాగణపతి, దత్తాత్రేయ, సాయినాథుల మూలవిరాట్‌కు విశేష అభిషేక, అలంకార సేవలుంటాయని ఆయన తెలిపారు. సామూహిక సాయిసత్యవ్రతాలు, సాయంత్రం నగరోత్సవం ఉంటాయని భక్తులు వేడుకల్లో పాల్గొని తీర్థప్రసాదాలందుకోవాలని కోరారు.

ఘనంగా కృతజ్ఞతా కూడిక


కార్యక్రమంలో పాల్గొన్న పాస్టర్లు

అనంతపురం కల్చరల్: జిల్లా పాస్టర్లు మంగళవారం స్థానిక ఎస్ఎస్ ప్రార్థనా ప్రాంగణంలో కృతజ్ఞతా కూడిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలను పాస్టర్ అబ్రహాం పాస్టర్ రూఫస్ కుమార్ ఆరంభించారు. జీఆర్ ఆనంద్ వాక్యపరిచర్య చేస్తూ క్రీస్తునామాన్ని ఘనపరిచేవారికి ఎటువంటి లోటు ఉండదని, భగవంతుడు చూపిన మార్గాన్ని శ్రద్ధాభక్తులతో అనుసరించాలన్నారు. కాగా జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు రెవరెండ్ నెహెమ్యా నాగరాజు జన్మదిన వేడుక సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా క్రిస్టియన్ మైనార్టీ నాయకులు వైపీ బాబు, పాస్టర్లు జహంగీర్ జాషువా, మనుష్యే, జీవన్‌బాబు, లాబాను సుధాకర్, లీనా డేబోరా పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు భారతరత్న ఇవ్వాలి

రాప్తాడురూరల్: తెలుగు రాష్ట్రాలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలకు గుర్తుగా భారతరత్న ఇచ్చి గౌరవించాలని రాయలసీమ రెడ్డి జనసంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ఇప్పటికీ లక్షలాదిమంది ప్రాణాలను నిలబెడుతూనే ఉందన్నారు. ఆయన ప్రారంభించిన జలయజ్ఞం ఫలితాలు ఈరోజు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. సస్యశ్యామలమయ్యే రోజు త్వరలోనే ఉందన్నారు. వైఎస్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో తెలుగు రాష్ట్రాల్లో లక్షలమంది పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయిలో చేరుతున్నారన్నారు. తెలుగు వారికి చేసిన సేవలకు గుర్తుగా వైఎస్ రాజశేఖర్ రెడ్డికి భారతరత్న ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

క్రమశిక్షణతో తపాలా శాఖకు సేవలు


పోస్ట్‌మాస్టర్ గౌస్‌పీరాన్‌ను సన్మానిస్తున్న తపాలా ఉద్యోగులు

అనంతపురం సిటీ: అనంతపురం ఓల్డ్ టౌన్ పోస్ట్‌మాస్టర్(హెచ్ఎస్‌జీ–2)గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన వై.గౌస్‌పీరాన్ క్రమశిక్షణకు మారుపేరని వక్తలు కొనియాడారు. బుద్ధప్పనగర్‌లోని అలేఖ్య ఫంక్షన్ హాలులో మంగళవారం ఆయనకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. అనంతపురం హెడ్ పోస్ట్‌మాస్టర్ భానుకుమార్, తపాలా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు బ్రహ్మానందరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, సీనియర్ పోస్ట్‌మాస్టర్ నిర్మల సహా ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు, ఎస్కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ డా.లోకేశ్, మాజీ ఎగ్జామినర్ మురళీధర్ ముఖ్య అతిథులుగా హాజరై గౌస్ పీరాన్‌ను పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించండి

అనంతపురం కల్చరల్: బ్రాహ్మణ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించడంతోపాటు నిధులు కేటాయించాలని బ్రాహ్మణ వధూవర పరిచయ వేదిక అధ్యక్షుడు బత్తలపల్లి సత్యరంగారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పేద బ్రాహ్మణులు ఉపాధి లేక నిరుద్యోగంతో ఉన్నారని, అలాంటివారిని ఆదుకునేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు.

పింఛన్లు 99.8 శాతం పంపిణీ

అనంతపురం క్రైం: ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ 99.8 శాతం పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య మంగళవారం తెలిపారు. వందశాతం పంపిణీ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది శ్రమించి అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేశారని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని డీ3 సెక్షన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. శ్రీనగర్ కాలనీ, రుద్రంపేట, కోవూరునగర్, స్టేట్‌బ్యాంక్ కాలనీ, రామ్‌నగర్, లక్ష్మీనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు.